## ఉపాధి పనుల పరిశీలన

పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో విద్యాచందన

జూలూరుపాడు, ఏప్రిల్ 20: మండలంలోని గుండెపుడి గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఉపాధిహామీ సిబ్బంది మార్కింగ్ ఇచ్చిన ప్రదేశంలోనే ఉపాధిహామీ పనులు చేపట్టాలని డీఆర్‌డీఓ పీడీ విద్యాచందన శనివారం పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకం సిబ్బంది మార్కింగ్ చేసిచ్చిన ప్రదేశంలోనే పనులు చేపట్టాలన్నారు. ఎంపీడీవో కరుణాకర్ రెడ్డి, ఏపీవో రవి పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌లో పిల్లలను చేర్పించండి

పరికరాలతో పిల్లలు, సీడీపీవో తార

టేకులపల్లి, ఏప్రిల్ 20: అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌లో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్ట్ ఆఫీసర్ కెఎం.తార కోరారు. మండలంలోని చింతోనిచెలక పంచాయతీలో శనివారం అంగన్‌వాడీ కేంద్రం వార్షికోత్సవం జరిగింది. ప్రీ స్కూల్‌పై పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. పిల్లలను అంగన్‌వాడీ సెంటర్‌కు పంపితే వారు శారీరకంగా–మానసికంగా–సామాజికంగా అభివృద్ధి అవుతారని చెప్పారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలల అభివృద్ధిపై సమీక్ష

అశ్వారావుపేట: మాట్లాడుతున్న ఎంపీడీవో

అశ్వారావుపేట, ఏప్రిల్ 20: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులపై ఎంపీడీవో జి.శ్రీనివాసరావు అధికారులతో శనివారం మండల పరిషత్ కార్యలయంలో సమీక్షించారు. మహిళా సంఘాల పర్యవేక్షణలోనే పనులు నాణ్యతగా జరగాలని స్పష్టం చేశారు. ఎంఈవో పి.కృష్ణయ్య, ఎంపీవో సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

## పనుల పరిశీలన

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 20: మండలంలో పాండురంగాపురం అమ్మ ఆదర్శ పాఠశాలలో అభివృద్ధి పనులను ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి శనివారం పరిశీలించారు. మండలంలోని 32 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేసినట్లు చెప్పారు. వీటిలో విద్యుత్, మంచినీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులకు నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఏఈ ఉర్మిళ, హెచ్ఎం ఉత్తర కుమారి తదితరులు పాల్గొన్నారు.

## 28న ఆర్య, వైశ్య సంఘం ఎన్నికలు

అశ్వారావుపేట టౌన్, ఏప్రిల్ 20: జిల్లా ఆర్య, వైశ్య సంఘం ఎన్నికలు ఈ నెల 28న జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న నాయకుడు పల్లపోతుల వాసు శనివారం స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. తనను గెలిపిస్తే పేద ఆర్య వైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నాయకులు జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, శీమకుర్తి శ్రీనివాసరావు, జల్లిపల్లి గుప్త, కొణిజర్ల ఉమామహేశ్వరావు, జల్లిపల్లి దేవరాజు, కంచర్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

## బెండాలపాడులో చోరీ

చోరీ జరిగిన ప్రదేశంలో క్లూస్ టీం తనిఖీలు

చండ్రుగొండ, ఏప్రిల్ 20: ఇంటి ఆవరణలో అర్ధరాత్రి గాఢ నిద్రలో ఉన్న మహిళ మెడలోని గొలుసును దొంగ(లు) కాజేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. బెండాలపాడు గ్రామస్తుడు బానోత్ మంగయ్య ఇంటి ఆవరణలో శుక్రవారం అర్ధరాత్రి మహిళ గాఢ నిద్రలో ఉన్నది. దొంగ(లు) ఆమె మెడలోని బంగారపు గొలుసును కత్తిరించి కాజేశారు. ఆమె ఫిర్యాదుతో ఆ ఇంటిని జూలూరుపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై మాచినేని రవి, క్లూస్ టీం బాధ్యులు శనివారం పరిశీలించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K Ph: 9640258899/9640468899
NT-311829

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## క్షతగాత్రుడిని కాపాడిన ఎస్సై

భద్రాచలం, ఏప్రిల్ 20: పురుషోత్తపట్నం గ్రామం వద్ద తాటాకులగూడెనికి చెందిన శివ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి కనిపించడంతో 141 సీఆర్పీఎఫ్ ఎస్సై ఎండీ యాకూబ్ స్పందించాడు. వెంటనే హెడ్‌క్వార్టర్‌కు ఫోన్ చేసి అంబులెన్స్ తెప్పించి క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి వైద్యచికిత్సలు అందించారు. సమయానికి తీసుకు రావడంతో అతనికి ప్రాణాపాయం తప్పిందని, సరైన సమయంలో తీసుకువచ్చిన ఎస్సైను వైద్యులు అభినందించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంల తరలింపు

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు ఈవీఎం యంత్రాలను తరలిస్తున్నట్లు కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రియాంక ఆల అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఉన్న ఈవీఎం గోదామును శనివారం అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి పరిశీలించారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ సెగ్మెంట్ల స్ట్రాంగ్ రూమ్‌లకు మొదటి ఈవీఎం ర్యాండమైజేషన్‌లో కేటాయించిన యంత్రాలను తరలిస్తున్నామన్నారు. కొత్తగూడెం సెగ్మెంట్‌కు కేటాయించిన 316 బ్యాలెట్ యూనిట్లు, 316 కంట్రోల్ యూనిట్లు, 354 వీవీ ప్యాట్లు రామచంద్ర డిగ్రీ కాలేజీలో భద్రపరిచినట్లు చెప్పారు. భద్రాచలం అసెంబ్లీ సెగ్మెంట్‌కు కేటాయించిన 226 బ్యాలెట్ యూనిట్లు, 225 కంట్రోల్ యూనిట్లు, 252 వీవీ ప్యాట్లు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో, అశ్వారావుపేట అసెంబ్లీ సెగ్మెంట్‌కు కేటాయించిన 230 బ్యాలెంట్ యూనిట్లు, 230 కంట్రోల్ యూనిట్లు, 257 వీవీ ప్యాట్లు అశ్వారావుపేటో అగ్రికల్చరల్ యూనివర్సిటీ కాలేజీలో భద్రపరిచామని అన్నారు. ఇల్లెందు అసెంబ్లీ సెగ్మెంట్‌కు కేటాయించిన 302 బ్యాలెట్ యూనిట్లు, 302 కంట్రోల్ యూనిట్లు, 338 వీవీ ప్యాట్లు ఇల్లెందు సింగరేణి బాలికల పాఠశాలలో, పినపాక అసెంబ్లీ సెగ్మెంట్‌కు కేటాయించిన 312 బ్యాలెట్ యూనిట్లు, 312 కంట్రోల్ యూనిట్లు, 350 వీవీ ప్యాట్లు మణుగూరు ప్రభుత్వ ఉన్నత పాఠవాలలో భద్రపరిచినట్లు వివరించారు. కొత్తగూడెం ఆర్డీవో మధు, ఎన్నికల విభాగం తహసీల్దార్ దారా ప్రసాద్, తహసీల్దార్ పుల్లయ్య పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

# ఎన్నికల వ్యయంపై సమావేశం

ఇల్లెందు రూరల్ : మాట్లాడుతున్న నోడల్ అధికారి

చండ్రుగొండ : పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 20: పార్లమెంట్ ఎన్నికల వ్యయంపై జిల్లా అధికారులు శనివారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇల్లెందు నియోజకవర్గ పరిధిలోని అన్ని బృందాల అధికారులు పాల్గొన్నాయి. ఎన్నికల ఖర్చు నమోదుపై మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు రామ్‌కుమార్ గోపాల్ సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా నోడల్ అధికారి సయ్యద్ ఖుర్షీద్, లైజనింగ్ ఆఫీసర్ తిరుపతయ్య, అదనపు రిటర్నింగ్ ఆఫీసర్ కాశయ్య, సహాయ వ్యయ పరిశీలకుడు కోటయ్య, ఏఆర్వో కోట రవికుమార్, మున్సిపల్ కమిషనర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన

చండ్రుగొండ, ఏప్రిల్ 20: మండలంలోని పోలింగ్ కేంద్రాలను జూలూరుపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి శనివారం పరిశీలించారు. ఎస్సై మాచినేని రవి తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల ముమ్మర తనిఖీలు

వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

కరకగూడెం, ఏప్రిల్ 20: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండలంలోని ప్రధాన రహదారిపై శనివారం అధికారులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మండల ప్రత్యేక అధికారి దినేష్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎస్ఐ రాజేందర్ పాల్గొని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనదారులు అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### విద్రోహశక్తులకు సహకరించవద్దు

అటవీ ప్రాంతాలలో నివాసముంటున్న వలస ఆదివాసీలు విద్రోహ శక్తులకు సహకరించవద్దని కరకగూడెం ఎస్ఐ రాజేందర్ సూచించారు. శనివారం మండలంలోని పలు వలస ఆదివాసీ గూడేలను సందర్శించి వారితో మాట్లాడారు. వలస ఆదివాసీలు తమ ప్రాంతాలకు ఎవరైన అపరిచిత వ్యక్తులు వస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి విద్యార్థులే భావి భారత పౌరులు

విద్యార్థులతో మణుగూరు సీఐ సతీష్‌కుమార్

పాల్వంచ : పట్టాలు అందుకుంటున్న విద్యార్థులు

మణుగూరు టౌన్, ఏప్రిల్ 20: నేటి విద్యార్థులే బావి భారత పౌరులని మణుగూరు సీఐ సతీష్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎక్స్‌లెంట్ స్టార్ హైస్కూల్‌లో జరిగిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉన్నత విద్యా సామర్థ్యంతో చిన్నారులకు విద్యనందిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్‌పర్సన్ యూసఫ్‌షరీఫ్, కరస్పాండెంట్ ఖాదర్, యాకూబ్ షరీఫ్, సమియా నయ్యర్, ఉపాధ్యాయురాలు జీనత్ తదితరులు పాల్గొన్నారు.

### 'కేఎల్ఆర్'లో గ్రాడ్యుయేషన్ డే

పాల్వంచ, ఏప్రిల్ 20: స్థానిక కేఎల్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం గ్రాడ్యుయేషన్ డే జరిగింది. ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలను టీఎస్ జెన్కో పాల్వంచ ఎస్ఈ జంగయ్య, విద్యావేత్త ప్రొఫెసర్ హరిత ప్రదానం చేశారు. విద్యాసంస్థల చైర్మన్ నాగమణి, ప్రిన్సిపాల్ సురేంద్రకుమార్, వైస్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కాశీ విశ్వనాథ్, మురళీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన పథకానికి రూ.50వేలు వితరణ

భద్రాచలం, ఏప్రిల్ 20 : భద్రాచలం సీతారామచంద్ర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అన్నదాన పథకానికి విశాఖపట్నం అయ్యప్ప నగర్‌కు చెందిన రాంకుమార్ రూ.50వేలు వితరణగా అందజేశారు. శనివారం తన తరపున పట్టణానికి చెందిన వేగేశ్న శ్రీనివాసరాజు ద్వారా దేవస్థానం అధికారులకు రూ.50వేలు పంపించగా, వారు దేవస్థానం తరపున రశీదును అందజేశారు. ఆలయ అధికారి లింగాల సాయిబాబా, ఆలయ వేద పండితులు హనుమత్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దల సమక్షంలో ఒక్కటైన ప్రేమ జంట

కరకగూడెం, ఏప్రిల్ 20: కొద్ది రోజులుగా జరుగుతున్న ప్రేమవివాదం శనివారం పెద్దల సమక్షంలో ఈ జంట ఒక్కటవడంతో సద్దుమణిగింది. మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన గొగ్గల రవి, పద్మ దంపతుల కుమార్తె లక్ష్మీప్రసన్న ఇదే గ్రామానికి చెందిన పోలెబోయిన నర్సయ్య, నాగలక్ష్మి దంపతుల కుమారుడు శేఖర్‌కు మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పెద్దల సమక్షంలో పెళ్లి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీప్రసన్న, శేఖర్ హైదరాబాద్‌లో ఇద్దరు ఉన్నత చదువులు చదువుతున్నారు. వారిద్దరూ ప్రేమించుకొని కుటుంబ సభ్యులకు తెలిపారు. కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో ఇరు కుటుంబాల మధ్య కొన్ని రోజులుగా వివాదం చోటు చేసుకుంటున్నది. ఈ వివాదం గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ జరిగింది. గ్రామపెద్దలు ఇరుకుటుంబాలతో మాట్లాడి సమస్యను పరిష్కరించి ప్రేమజంటకు వివాహం చేశారు.

# 17మందిని హింసించి కాల్చి చంపారు!

**బీజేపీ నేతలకు ప్రజాకోర్టులో శిక్ష తప్పదు**

**కలకలం రేపుతున్న మావోయిస్టు పార్టీ లేఖ**

**ఈ నెల 25న బంద్‌కు పిలుపు**

కొత్తగూడెం క్రైం, ఏప్రిల్ 20 : ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో జరిగింది నరమేధమని, గాయాలపాలైన వారిని పట్టుకుని క్రూరంగా హింసించి చంపారంటూ మావోయిస్టు పార్టీ పేరుతో శనివారం విడుదలైన లేఖ సంచలనం సృష్టిస్తోంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా చోటేబేథియా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో 29మంది మావోయిస్టులు మృతిచెందిన ఘటనపై ఆ పార్టీ ఉత్తర్ బస్తర్ జోనల్ కమిటీ బ్యూరో మంగ్లీ పేరుతో మూడు పేజీల లేఖ విడుదలైంది. ఈ ఎన్‌కౌంటర్ పూర్తిగా అమానవీయమైన సంఘటన అని, నమ్మకద్రోహానికి తమ పార్టీ పీఎల్‌జీఏ సభ్యులు వీరమణం పొందారంటూ లేఖలో తెలిపారు. తమ పార్టీపై పూర్తి సమాచారం తెలిసిన శత్రువుల ద్వారా సమాచారం తెలుసుకున్న భద్రతాదళాలు ఆ ప్రాంతాన్ని నలుదిక్కులా చుట్టుముట్టి మూకుమ్మడి దాడి చేశారన్నారు. ఈ ఘటనలో 8మంది గాయపడిన మావోయిస్టులను పట్టుకుని హింసించి చంపారని, మరో 11మంది నిరాయుధులని పట్టుకుని అక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న స్మారకస్థూపం వద్దకు తీసుకుని వెళ్లి, వారిని కర్రలతో అతిదారుణంగా కొట్టి ఆ తరువాత తుపాకులతో కాల్చి చంపారని ఆరోపించారు. దొరికిన మావోయిస్టులను ఆదివాసీ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్, గృహమంత్రి విజయ్‌శర్మ, ఐజీ సుందర్‌రాజ్, కాంకేర్ ఎస్పీ ఏకే ఎల్‌సేలా ఆదేశాల మేరకే హత్య చేశారంటూ పేర్కొన్నారు. ముందుగా పోలీస్ బలగాలు తమ నిరాయుధులైన సభ్యులను బంధించి వాహనాలు వచ్చే సమయానికి వారిని హత్య చేసి మృతదేహాలను వాహనాల్లో తరలించారంటూ ప్రస్తావించారు. ఈ ఘటన మధ్యాహ్నం 1:30 గంటల నుంచి 3గంటల వరకు జరిగిందని, ముందుగా 12మంది ఎదురుకాల్పుల్లో చనిపోయారని, ఆ తరువాత 17మంది చనిపోయారని అనంతరం గంట వ్యవధిలోనే 29 మంది మృతిచెందారని వెల్లడిస్తూ పక్కా ప్రణాళిక రచించారని ఆరోపించారు. ఈ ఘటనలో 12 మంది బుల్లెట్ గాయాలతో మృతిచెందారని, మిగతా 17మందిని పోలీస్ బలగాలు హింసించి హతమార్చారంటూ ఆరోపించారు. ఆదివాసీలను హతమార్చడానికి ఆదివాసీ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్‌ని ఆ పీఠంపై కూర్చోబెట్టారన్నారు. ఈ నర సంహారానికి ఛత్తీస్‌గఢ్‌లోని ప్రతి బీజేపీ నేతా జవాబుదారి అని, ప్రజాకోర్టులో వారికి తప్పక శిక్ష పడుతుందని హెచ్చరికలు జారీ చేశారు. కాంకేర్ ఘటనపై ప్రజా సంఘాలన్ని నోరు విప్పాల్సిన అవసరం ఉందని లేఖ ద్వారా కోరారు. ఇదిలాఉండగా మృతి చెందిన మావోయిస్టులకు నివాళిగా ఈ నెల 25వ తేదీన నారాయణ్‌పూర్, కాంకేర్, మాన్‌పూర్–మోహ్లా జిల్లాల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ప్రకటించారు.

## కొత్తగూడెం అదనపు జిల్లా జడ్జి బదిలీ

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 20: కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా జడ్జి ఎం.శ్యాంశ్రీ బదిలీ అయ్యారు. సూర్యాపేట జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జిగా నియమితులయ్యారు.

## అనుచిత వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు

ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జూలూరుపాడు, ఏప్రిల్ 20: బీఆర్ఎస్ జిలా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుపై అనుచిత వాఖ్యలు చేశారంటూ కారేపల్లి మండలానికి చెందిన సోమందుల నాగరాజుపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. బీఆర్ఎస్ మాచినేనిపేట తండా గ్రామ అధ్యక్షుడు లకావత్ హేమ్లా శనివారం ఏఎస్సై తిరుపతిరావుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందించారు. నాగారజుపై చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు, భూక్యా కళావతి, సేవా, జవహర్, చందర్ పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

ములకలపల్లి, ఏప్రిల్ 20: స్థానిక భక్తాంజనేయ ఆలయంలో మూడు దశాబ్దాలుగా స్వామికి సేవలు చేస్తున్న కేతేపల్లి నాగరత్నానికి సద్గురు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ గాజర్ల వీరభద్రం రూ.2,000 పంపారు. పేదరాలైన ఆమెకు ఈ మొత్తాన్ని పాత్రికేయుడు శేషగిరిరావు శనివారం అందించారు.

## ఏఈపై సస్పెన్షన్ ఎత్తివేతకు వినతి

ములకలపల్లి, ఏప్రిల్ 20: ములకలపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతూ మండలంలోని ఎంపీటీసీ సభ్యులు శనివారం ఎంపీడీవో భారతికి వినతిపత్రం ఇచ్చారు. పుల్లారావు (వైస్ ఎంపీపీ), నూపా సరోజిని, కోఆప్షన్ సభ్యులు జబ్బార్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ కాలేజీల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 20: ప్రతిభావంతులైన గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఇంటర్‌లో చేర్చుకునేందుకు, ఎంసెట్ శిక్షణ ఇచ్చేందుకు గుర్తింపు పొందిన కార్పొరేట్ కళాశాలల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి అనసూయ ఒక ప్రకటనలో తెలిపారు. www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 27వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

## వాగులో పడి వ్యక్తి మృతి

ములకలపల్లి, ఏప్రిల్ 20: వాగులో మునిగి వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ములకలపల్లి నుంచి రింగురెడ్డిపల్లి వెళ్లే మార్గంలోని వాగుపై బ్రిడ్జి నిర్మాణంలో ఉంది. వాగులోని నీటి ప్రవాహాన్ని ఆపేందుకు అడ్డుగా కట్ట కట్టారు. దీంతో అక్కడ నీరు నిల్వ ఉంది. శనివారం అటుగా వెళ్లిన గేదెల కాపరి కొట్టే శ్రీను, ప్రమాదవశాత్తు అందులో పడి గల్లంతయ్యాడు. ఈ సమాచారంతో ఎస్సై రాజమౌళి బృందం గాలింపు చేపట్టింది. రెండు గంటల తరువాత మృతదేహం కనిపించింది. శ్రీను కుటుంబీకుల ఫిర్యాదుతో కేసును ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం స్వాధీనం

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 20: మండలంలోని యానంబైలులో సత్యనారాయణ నిర్వహిస్తున్న బెల్ట్ షాపులో రూ.16వేల విలువైన మద్యం బాటిళ్ళను అధికారులు శనివారం స్వాధీనపర్చుకున్నారు. వీటిని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు.

## ఉపాధి కూలి రూ.300 చెల్లించాలి

అశ్వారావుపేట టౌన్, ఏప్రిల్ 20: తమకు రోజువారీ కూలి రూ.300 చెల్లించాలని జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలు విజ్ఞప్తి చేశారు. అశ్వారావుపేట పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను కార్యనిర్వహణాధికారి(ఈవో) హరికృష్ణ శనివారం పరిశీలించారు. కూలీలు మాట్లాడుతూ.. తకు రోజువారీ కూలి కనీసం రూ.150 కూడా పడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన పనికి కొలతల ఆధారంగానే కూలి చెల్లింపు ఉంటుందని ఈవో సమాధానమిచ్చారు. పని ప్రదేశానికి ఉదయం ఆరింటికి వచ్చి పది గంటల వరకు పనిచేయాలన్నారు.

## పనులు ముమ్మరం

చుంచుపల్లి, ఏప్రిల్ 20: మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రతి పంచాయతీలో సుమారు 500 మందికి పైగా కూలీలు హాజరవుతున్నారు.

## 28న 'ఏకలవ్య' ప్రవేశ పరీక్ష

టేకులపల్లి, ఏప్రిల్ 20: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 28న పరీక్ష ఉంటుందని మండలంలోని బద్దుతండాలో గల ఏకలవ్య పాఠశాల పిన్సిపాల్ భద్రయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన విద్యార్థులు అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

## కార్మికుల పనివేళలు మార్చాలి

మణుగూరుటౌన్, ఏప్రిల్ 20: ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కార్మికుల పనివేళలు మార్చాలని కోరుతూ మణుగూరు ఏరియా ఎస్టోటూ జీఎం శాంసుందర్‌కు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం కాంట్రాక్టు కార్మికులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు మిడిదొడ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికులు తీవ్ర ఉష్ణోగ్రతలకు అల్లాడిపోతున్నారన్నారు. కార్యక్రమంలో గురుమూర్తి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, శివరామకృష్ణ, సత్యవతి, రమణ, నాగమణి, రమాదేవి, అనసూయ పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో జూదరులు

జూలూరుపాడు, ఏప్రిల్ 20: మండల కేంద్రంలోని ఓ హోటల్లో పేకాట ఆడుతున్న 9 మంది జూదరులను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓ హోటల్లో కొందరు పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు స్థానిక పోలీసులు శనివారం ఆ హోటల్‌పై దాడులు నిర్వహించారు. ఆ సమయంలో అక్కడ పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.34 వేల నగదు, 9 సెల్‌ఫోన్లు, 6 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను స్టేషన్‌కి తరలించి విచారణ చేస్తున్నారు.

## పోలీసు సిబ్బందికి ప్రశంసాపత్రాలు

ప్రశంసాపత్రాలు అందుకుంటున్న మణుగూరు పోలీసు సిబ్బంది

మణుగూరుటౌన్, ఏప్రిల్ 20: తమిళనాడులో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా సక్రమంగా విధులు నిర్వహించిన మణుగూరు పోలీసు సిబ్బందికి కోయంబత్తూర్ పోలీస్ కమిషనర్ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో మణుగూరు పోలీసు సిబ్బంది కె.కష్ణంరాజు, జి.కళ్యాణ్, కేపీ.జగదీష్ తదితరులు ఉన్నారు.

## ప్రమాదకరంగా గుంత.. పట్టించుకునేవారేరి..?

ప్రమాదకరంగా మారిన గుంత ఇదే

సారపాక, ఏప్రిల్ 20: పారిశ్రామిక ప్రాంతమైన సారపాకలో ఓ పాఠశాల సమీపంలో రోడ్డు పక్కన పెద్ద గుంత ప్రమాదకరంగా మారింది. నిత్యం పాఠశాలకు వెళ్లే పిల్లలు అటుగా వెళ్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయపడుతున్నారు. గుంత ఉన్న స్కూల్ ఏరియాలో శనివారం ఓ తల్లి తన పిల్లలను దగ్గరుండి పాఠశాలకు పంపించడం దర్శనమిచ్చింది. పంచాయతీ ఈవో స్పందించి తక్షణమే ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్పించాలని స్థానిక ప్రజలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.